'పది' పరీక్షలు షురూ

- జిల్లా వ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో 99.72 శాతం హాజరు
- తొలి రోజు 10,298 మంది విద్యార్థులకు 10,270 మంది హాజరు
- 28 మంది విద్యార్థులు గైర్హాజర్
- జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ : జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 18 : సోమవారం ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు ప్రథమ బాష పరీక్షకు 10,298 విద్యార్థులకు10, 270 మంది విద్యార్థులు హాజరు కాగా, 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విలేకరులకు తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు ఐదుగురికి నలుగురు హాజరయ్యారు. తొలి రోజు పరీక్షలకు విద్యార్థులు తల్లిదండ్రులతో, వారివారి బంధువులతో పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. కౌడిపల్లి మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామాయంపేట, నిజాంపేట, శంకరంపేట (ఆర్) మండలంలోని పరీక్షా కేంద్రాలను డీఈవో రాధాకిషన్ సందర్శించారు. పాపన్నపేట, మనోహరాబాద్, తూప్రాన్, చేగుంటలోని పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో ఎక్కడ డిబార్‌కు కానీ, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 99.72 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్లలోపు గల జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలనే నిబంధనతో సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను పరీక్షలు జరిగిన సమయంలో మూసివేశారు. విద్యార్థులకు గానీ తల్లిదండ్రులకు గానీ ఏమైన సందేహాలు ఉంటే జిల్లా పరీక్షల కంట్రోల్ రూమ్ నంబర్ 9032625296 నంబర్ సంప్రదించాలని డీఈవో సూచించారు.

చిన్నశంకరంపేటలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

రామాయంపేట : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోసం ఫస్ట్ ఏయిడ్

టేక్మాల్ : పరీక్షల హాలులోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలి

ఏదుల్లాపూర్‌లో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, మార్చి 18 : ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏదుల్లాపూర్‌లో ఆంజనేయస్వామిని దర్శించుకొని గుండ్లపల్లిలో జరుగుతున్న మల్లన్నస్వామి ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యేడు మంచి వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి హనుమంతరావు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ సర్పంచ్‌లు కల్లూరి కీర్తనహనుమంతరావు, పెంజర్ల శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్, బాలమణి నరేందర్, మర్రి మహేందర్‌రెడ్డి, యువ నాయకుడు పైనం సందీప్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన ఓ నిరుపేద వరుడి వివాహానికి కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి హనుమంతరావు రూ. 75వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన గొష్కె సుగుణ, బాలనర్సయ్య దంపతుల కుమారుడు యాదగిరి వివాహానికి పుస్తెమట్టెలకు రూ. 25వేలు, పెండ్లి భోజనాలకు రూ. 50వేలు, మొత్తం రూ.75 వేల ఆర్థికసాయం అందజేశారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి హనుమంతరావు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ఆశీర్వదించారు. వారి వెంట మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తనహనుమంతరావు, కల్లూరి ముత్యాలు ఉన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

మల్లికార్జున స్వామి కల్యాణంలో పాల్గొన్న యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు

నిజాంపేట, మార్చి18 : మండలంలోని నందగోకుల్‌లో గల మల్లికార్జున స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు యాదవ సంఘం సభ్యులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, శివసత్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలను తొక్కారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యాదవ సంఘం సభ్యులు రాజయ్య, శ్రీశైలం, దేవయ్య, యాదయ్య, శ్రీనివాస్, మహేశ్, ప్రశాంత్, కనకరాజు, గ్రామస్తులు ఉన్నారు.

వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు

చేగుంట,మార్చి18 : చేగుంట మండల పరిధిలోని మక్కరాజిపేటలోని పెద్దమ్మతల్లి వనదుర్గ దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు రావాలని కమిటీ సభ్యులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని, బీఆర్ఎస్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు సోలిపేట సతీశ్ రెడ్డిని సోమవారం కలిశారు. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించే వార్షికోత్సవ వేడుకలకు రావాలని కోరారు. జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఎంపీటీసీ బండి కవితావిశ్వేశ్వర్, ఇబ్రహీంపూర్ సొసైటీ వైస్ చైర్మన్ తానిషా, ముదిరాజ్ సంఘం నాయకులు చెన్నబోయిన లింగం, జింక శ్రీనివాస్, బంగారు భిక్షపతి, కాశబోయిన యాదగిరి, చెన్నబోయిన ఎల్లం, మెగులయ్య, రంగ కృష్ణ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు రామాయంపేట పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పెద్దమ్మ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే స్వగృహం కొంపల్లికి వెళ్లి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దేవుని నర్సింహులు, పట్టణ కౌన్సిలర్ దేమె యాదగిరి, సర్వయ్య, భూమ రమేశ్, రొయ్యల పోచయ్య తదితరులు ఉన్నారు.

-రామాయంపేట, మార్చి 18

పంచాయతీ కార్యదర్శుల నిరసన

పెద్దశంకరంపేటలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

పెద్దశంకరంపేట, మార్చి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో ఎంపీవోపై ఎంపీపీ దాడిని నిరసిస్తూ సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయలం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీకున్నీసా, మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చక్రధర్, గౌసియా బేగం, మహేశ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి 73 అర్జీలు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు కూడా సమస్యలను నేరుగా ప్రజావాణిలో చెప్పుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ధరణి భూ సమస్యల గురించి 33, పెన్షన్ కోసం 4, ఉపాది కోసం 3, ఇతర సమస్యల గురించి 33 మంది నుంచి అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అల్లాదుర్గం, మార్చి 18 : మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీవో విజయ భాస్కర్ తెలిపారు. ఎంపీపీ అనిల్ కుమార్ అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అధికారులు పాల్గొనాలని కోరారు.

వెల్దుర్తిలో గాలివాన దుమారం

సోమవారం సాయంత్రం వెల్దుర్తిలో కురుస్తున్న వర్షం

వెల్దుర్తి, మార్చి 18 : మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం గాలివాన దుమారం రేపింది. ఒక్కసారిగా ప్రారంభమైన భారీ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, భారీ వర్షానికి ప్రజలు బెంబేలెత్తారు. అరగంటకు పైగా కురిసిన వర్షం, తగ్గుతూ, పెరుగుతూ కురిసింది. కురిసిన అకాల వర్షంతో రైతన్నలు వరిపంటలు దెబ్బతింటాయని, ఆందోళన వ్యక్తం చేయగా, అసలే ఎండ వేడిమి, ఒక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి సేదతీరారు.

చిన్నశంకరంపేటలో ..

చిన్నశంకరంపేట, మార్చి 18 : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. చిన్నశంకరంపేటలో వడగండ్లవాన కురిసింది. ఈదురు గాలులతో మడూరు నుంచి గజగట్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది.

గాలివానతో రహదారిపై అడ్డంగా విరిగిపడ్డ చెట్టు

చిన్నశంకరంపేటలో కురిసిన వడగండ్ల వాన

బాలికలకు కరాటే విద్య ఎంతో అవసరం

కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

చిన్నశంకరంపేట, మార్చి18 : అరాచకాలను ఎదుర్కోవడానికి కరాటే లాంటి విద్యలు బాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చందంపేట జడ్పీపాఠశాలలో రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రోగ్రాంలో భాగంగా మూడు నెలలుగా కరాటేలో శిక్షణ తీసుకున్న బాలికలకు సర్టిఫికెట్‌లను హెచ్ఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శంకర్, కరాటే మాస్టర్ నాగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ. 30.90 లక్షలు పలికిన తైబజార్ వేలం

వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

తూప్రాన్, మార్చి 18 : తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్, పశువుల సంతకు నిర్వహించిన వేలం పాట రూ. 30.90 లక్షలు పలికింది. గతేడాదితో పోలిస్తే తైబజార్ రూపంలో మున్సిపాలిటీకి రూ. 9.20 లక్షల ఆదాయం అధికంగా సమకూరింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ సోమవారం తూప్రాన్ మున్సిపల్ తైబజార్‌కు నిర్వహించిన వేలం పాటలో అత్యధికంగా తూప్రాన్ పట్టణానికి చెందిన తుమ్మల గణేశ్ రూ. 28.50 లక్షలకు, తూప్రాన్ పట్టణానికి చెందిన ఎండీ జాఫర్ రూ. 2.40 లక్షలకు పాట పాడి పశువుల సంతకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రఘువరణ్, అకౌంటెంట్ సంతోషి రాణి, జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, సాయిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రామాయంపేట పురపాలిక కమిషనర్ దేవేందర్

ఎన్నికల కోడ్ సందర్భంగా పట్టణంలోని గోడలపై ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలిగిస్తున్న పురపాలిక సిబ్బంది

రామాయంపేట, మార్చి 18 : ఎన్నికల నిబంధనలను పాటించకుంటే ఎంతటి వారికైనా శిక్షలు తప్పవని కచ్చితంగా చర్యలు తీసుకుంటామని రామాయంపేట పురపాలిక కమిషనర్ దేవేందర్ అన్నారు. సోమవారం రెండో రోజు సందర్భంగా రామాయంపేట పట్టణంలోని పురపాలిక సిబ్బందితో గోడలకు, విద్యుత్ పోళ్లకు, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఫ్లెక్సీలను తీయించివేశారు. ఎక్కడ కూడా కోడ్‌ను ఉల్లంఘించి పనిచేయ రాదని పట్టణవాసులకు తెలిపారు. ఒకవేల కోడ్‌ను ఉల్లంఘిస్తే పోలీస్ కేసులే గాకుండా తమకు చెందిన వ్యాపార సంస్థల లైసెన్సులను రద్దు చేయనున్నట్లు తెలిపారు. శిక్షలే గాకుండా జరిమానా కూడా విధించనున్నట్లు తెలిపారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

తూప్రాన్, మార్చి 18 : తూప్రాన్ పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. బీజేపీ మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్మోహన్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు మహేశ్ యాదవ్, పట్టణాధ్యక్షుడు మహేశ్ గౌడ్, సాయిబాబా గౌడ్, జానకీరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

మెదక్ అర్బన్, మార్చి18 : అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

నిధుల కేటాయింపులో వివక్ష

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

నర్సాపూర్, మార్చి 18 : నర్సాపూర్ మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధుల కేటాయింపులో వివక్ష చోటుచేసుకుందని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ జైరామ్ నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో వివక్ష చూపించారని ఆరోపించారు. 2,4,5,10, 11,13 వార్డులకు నిధుల కేటాయింపు విషయంలో వివక్ష చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా వార్డుల్లో అవసరం లేని పనులకు నిధులు కేటాయించారని వాపోయారు. కౌన్సిలర్లు లతారమేశ్ యాదవ్, యాదగిరి, సురేశ్, బుచ్చేశ్ యాదవ్ ఉన్నారు.

22, 23న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 18 : ఈనెల 22, 23వ తేదీల్లో మెదక్ జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు జడ్పీ చైర్పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఏల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశాలకు ఆయా శాఖాలధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కాల్ సెంటర్, మీడియా సెంటర్ పరిశీలన

కాల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు 2024 నియమావళిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్, ఏం సీఎంసీ మీడియా సెంటర్‌ను ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఎన్నికల్లో కాల్ సెంటర్‌లో వచ్చే ఫిర్యాదులు, లోకల్ చానల్ ప్రసారాలు, ఎన్నికల ప్రకటనలు, చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్‌ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య

వెల్దుర్తి, మార్చి 18 : ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటున్న కొడుకుని తండ్రి మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లిలో చోటుచేసుకుంది. వెల్దుర్తి పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలగౌని నర్సాగౌడ్ కుమారుడు బాలగౌని శేఖర్‌గౌడ్ (23) ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 15 శుక్రవారం రాత్రి మందలించాడు. మరుసటి రోజు శనివారం వెల్దుర్తి నుంచి గ్యాస్ సిలిండర్ తీసుకురమ్మని రూ. వెయ్యి ఇచ్చాడు. కొడుకు ఇంటికి రావపోవడంతో, వ్యవసాయ పొలం వద్ద ఉన్నట్టు గ్రామస్తులు తెలుపగా, అప్పటికే పురుగుల మంది తాగాడు. గమనించి వెంటనే తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, గాంధీ దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.